# సహనమేవ జయతే!

"చెప్పు... 'ఐ లవ్ యు' అని చెప్పు. లేకుంటే ఏం చేస్తానో తెలుసుగా?"

అజయ్ చేతిలో ఉన్న బ్రాటిల్‌లోని ద్రవం పొగలు క్రక్కుతోంది.

"నో అజయ్... నా మాట విను!" మౌనిక వేడుకుంటోంది.

"నీ నోటినుంచి నేను వినాల్సిన మాట ఒక్కటే- ఐ... లవ్... యు! నేను మూడు లెఖ్ఖపెట్టేలోపు నీ నోటినుంచి ఆ మాట వెలువడాలి. లేకుంటే యీ ఆసిడ్ అందమైన నీ ముఖాన్ని ముద్దాడుతుంది. కమాన్... వన్..."

"అజయ్!"

"టూ..."

"ప్లీజ్ అజయ్!" మౌనిక ఏడుస్తోంది.

స్టూడెంట్స్ అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు.

"త్రీ..."

"న్నో...." అంటూ కెవ్వున అరిచింది మౌనిక.

●

"ఏమిటమ్మా... ఏమైంది?"

తల్లిదండ్రులు కుదుపుతూ అడుగుతూంటే మెలకువ వచ్చింది మౌనికకు.

లేచి తన ముఖం చేత్తో తడుముకుని చూసుకుంది. తన ముఖానికి ఏం కాలేదని తెలుసుకుంది. వెంటనే తండ్రిని కౌగిలించుకుని ఏడవసాగింది.

"ఏమైందిరా కన్నా... ఏదైనా పీడకల వచ్చిందా?" సూర్యం అడిగాడు కూతుర్ని.

మౌనిక అవునన్నట్టు తలూపింది.

"కలే కదా... మర్చిపోమ్మా! లేచి బ్రష్ చేసుకునిరా... కాఫీ యిస్తాను. ముగ్గురం కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" అంది జయంతి.

మౌనిక లేచి బాత్‌రూమ్ వైపు నడిచింది.

"నాన్నా... నాకేదయినా అయితే మీరు తట్టుకోగలరా?" మౌనిక కాఫీ త్రాగుతూ తండ్రిని అడిగింది.

"తట్టుకోలేను. కానీ, ఎందుకలా ఏవేవో ఊహించుకుంటున్నావు నువ్వు? కలలో జరిగిన సంఘటనలను తలచుకుని భయపడే వ్యక్తి నా కూతురని తెలిసి నాకు అవమానంగా ఉందిరా!" నవ్వుతూ అన్నాడు సూర్యం.

"కలలో కాదు నాన్నా! ఇలలోనే జరగబోతోంది. అదీ... నా విషయంలోనే!"

●

కాలింగ్ బెల్ మ్రోగితే తలుపు తీసిన సుజాతకు– ఎదురుగా ఇరవై ఏళ్ల వయసున్న అమ్మాయి కనిపించింది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ అమ్మాయిని చూడగానే సదభిప్రాయం కలిగింది ఆమెకు.

"నమస్తే ఆంటీ! నా పేరు మౌనిక!"

"లోపలికి రామ్మా... కూర్చో!" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది సుజాత.

మౌనిక సోఫాలో కూర్చున్నాక "ఆంటీ! నేను 'ఈ తరం యువకుల మనోభావాలు' అన్న సబ్జెక్ట్ మీద ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నాను. అందుకోసం తమ కొడుకుల గురించి కొందరు తల్లుల అభిప్రాయాలు సేకరిస్తున్నాను. మీకూ కాలేజీలో చదివే కొడుకున్నాడని యీ బిల్డింగ్‌లో కొంతమంది చెప్పారు. అందుకోసం వచ్చాను..." అంది.

"అవును. మా అబ్బాయి అజయ్ బి.ఎస్.సి. రెండవ సంవత్సరం చదువుతున్నాడు."

"మీ అబ్బాయి గురించి చెప్పండి!" పెన్ను, పుస్తకం చేతిలోకి తీసుకుంటూ అంది మౌనిక.

"మా అజయ్ చాలా మంచివాడు. బాగా చదువుకుంటాడు. తల్లిదండ్రులంటే గౌరవం ఉన్నవాడు. ఆటల్లో చురుకు. ఫ్రెండ్స్ సర్కిల్ చాలా పెద్దది..."

అనర్గళంగా చెప్పుకుపోతున్న సుజాత– ఆ అమ్మాయి పుస్తకంలో రాసుకోకుండా తనవైపే చూస్తూ ఉండిపోవటం చూసి, ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది.

"నాకు కావలసింది నిజాలు ఆంటీ... పొగడ్తలు కావు!"

"నా బిడ్డ గురించి నేను చెప్పుకోవడం వల్ల అవి పొగడ్తలుగా నీకు అనిపించి ఉండవచ్చు కాని, నేను చెప్పినవన్నీ నిజాలే!"

"అయితే మీకు తెలియని నిజాలు చాలా ఉన్నాయి ఆంటీ!"

"ఏమిటమ్మా అవి? నీకు మా అజయ్ తెలుసా?" ఆందోళనగా అడిగింది సుజాత.

"తెలుసు. అజయ్ నా క్లాస్‌మేట్! అతను క్లాసులకు సరిగ్గా రాడు. ఒక్క పరీక్ష కూడా మొదటిసారి పాస్ కాలేదు. ఎన్ని పేపర్లు పెండింగ్ ఉన్నాయో అతనికన్నా గుర్తుందో, లేదో నాకు తెలియదు. కాలేజీలో అతనో రింగ్ లీడర్. లెక్చరర్లను ఏడిపిస్తూ, అమ్మాయిల్ని బెదిరిస్తూ ఉంటాడు."

షాక్ తిన్నట్లు వింటూండిపోయింది సుజాత. 'తను విన్నది నిజం కాకపోతే ఎంత బాగుంటుంది' అనుకుంది.

"వారంరోజుల్నుంచి నన్ను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. నేనూ అతన్ని ప్రేమించాలనీ, ప్రేమించకపోతే నా ముఖంపై ఆసిడ్ పోస్తాననీ, చంపుతాననీ బెదిరిస్తున్నాడు."

మౌనిక కళ్ళనిండా నీళ్లు చూసిన సుజాత హృదయం ద్రవించిపోయింది.

"ఊరుకోమ్మా... నేనున్నానుగా! నీకేం కాదు. అయినా వాడు యిలాంటివాడని వాడి స్నేహితులెవరూ నాతో చెప్పలేదు."

"అతని స్నేహితులూ అలాంటివాళ్ళే కనుక వాళ్ళు చెప్పరు. ఫీజులు కడితే తమ పని అయిపోయిందనుకుంటారు తల్లులు. కనీసం మూడు నెలలకోసారి కాలేజీకి వెళ్లి 'తమ పిల్లలు ఎలా చదువుతున్నారు? ఎలా ప్రవర్తిస్తున్నారు?' అని వాళ్ళ క్లోజ్ సర్కిల్‌లో లేని విద్యార్థులను, లెక్చరర్లను విచారిస్తే నిజం తెలుస్తుంది. మొక్కగా ఉన్నప్పుడే అటువంటి అవలక్షణాల్ని తెంపేస్తే తర్వాత బాధపడే అవసరం ఉండదు."

"నిజం చెప్పావమ్మా! పిల్లల చెడు ప్రవర్తన గురించి 'ఊరంతా తెలిశాక చివరగా తెలిసేది తల్లిదండ్రులకు' అంటారు. ఆ మాట మా విషయంలో నిజమైంది" అంది సుజాత ఏడుస్తూ. ఆమె చాలాసేపు దు:ఖంతో మాట్లాడలేకపోయింది.

"ఇంకో విషయం అడుగుతాను... నిజం చెప్పండి. ఇంట్లో అజయ్ ప్రవర్తన ఎలా ఉంటుంది?" అని అడిగింది మౌనిక.

"ఒక్కోసారి ఒక్కోలా ఉంటాడమ్మా! ఓరోజు అభిమానంగా మాట్లాడుతాడు. చెప్పిన పనులన్నీ చేస్తాడు. ఇంకో రోజు చిన్నాపెద్దా అని లేకుండా మాట్లాడుతాడు. వాడలా మాట్లాడితే వాళ్ళ నాన్నగారు ఎంతో బాధపడతారు. వాడికోసం ఆయన ఎంతగా తపిస్తారో... ఆయన పట్ల వీడు అంత నిర్లక్ష్యంగా ఉంటాడు. ఇరుగుపొరుగుతో మాత్రం సరదాగానే ఉంటాడు. మా బంధువులకూ వీడంటే యిష్టమే!"

"ఓ.కే! నా సమస్య మీకు చెప్పాను. నేనేం చేయాలో అజయ్ తల్లిగా కాకుండా సాటి మహిళగా చెప్పండి!"

"నేనూ నీలా షాక్‌లోనే ఉన్నానమ్మా! ఎంతో ముద్దుగా పెంచుకున్న బిడ్డ రాక్షసుడుగా మారితే తల్లిహృదయం ఎంత ఆందోళన పడుతుందో నీవు అర్థంచేసుకోగలవు. ఈ సమస్యకు పరిష్కారం నువ్వే చెప్పమ్మా! నాకంటే ఎక్కువ చదువుకున్నదానివి, ఈ తరం స్త్రీవి! నువ్వేం చెప్పినా చేస్తాను. వాడి కాళ్లు విరగ్గొట్టమంటావా? లేక, పోలీసులకు చెప్పి జైల్లో వేయించమంటావా?"

"అలా చేస్తే అతనిలోని రాక్షసుడు మరింత పెట్రేగిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యకు పరిష్కారం నేనే ఆలోచించాను. మీరు నాకు సహకరిస్తే చాలు. ఒక్కటి చెప్పండి... అజయ్‌లో మార్పు కోసం ప్రయత్నం చేస్తే ఫలితం ఉంటుందంటారా?"

"తప్పకుండా ఉంటుంది. ఈ విషయంలో నా సహకారం పూర్తిగా ఉంటుంది నీకు!" అంది సుజాత.

●

లైబ్రరీ బయట నిలబడివున్న అజయ్ అసహనంగా వాచీ చూసుకున్నాడు.

'టైము ఆరుంబావు అయింది... ఆరుగంటలకు వస్తానన్న మౌనిక యింకా రాలేదు!' అనుకుంటూ విసుగ్గా తలెత్తి చూసిన అతనికి– ఎదురుగా మౌనిక వస్తూండటం కనిపించింది.

అతని ముఖం ఆనందంతో విప్పారుతూంటే "హాయ్!" అంది మౌనిక అతన్ని సమీపించి.

"హాయ్! ఏమిటీ... నాతో మాట్లాడాలన్నావట?!"

"అవును. మొన్న నాతో ఏదో అన్నావు... ఇంకోసారి చెప్పు!"

"ఏం... కొడతావా?"

"కాదు. మళ్లీ విందామని!"

"ఐ లవ్ యు సోమచ్! నువ్వూ నన్ను ప్రేమించాలి. లేకుంటే..."

"చాలు చాలు! నువ్వు నిజంగా నన్ను అంత గాఢంగా ప్రేమిస్తున్నావా?"

"అవును..."

"నేను నిన్ను ప్రేమించడానికి నీకున్న క్వాలిఫికేషన్స్ ఏమిటో చెప్పు?"

"నేను అందంగా ఉన్నాను... చాలదా?"

"అందంగా ఉండటం అర్హత కాదు. అది అడ్జక్టివ్... అంతే!"

"నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను."

"అది క్రియ... వర్బ్!"

"అయితే నువ్వే చెప్పు... నిన్ను ప్రేమించే వ్యక్తికి ఏం క్వాలిఫికేషన్స్ ఉండాలో?!"

"నన్ను ప్రేమించే వ్యక్తికి కాదు, నా ప్రేమను ఆశించే వ్యక్తికి సంస్కారంతో కూడిన చదువు ఉండాలి. నన్ను పోషించేందుకు ఉద్యోగం ఉండాలి."

"రెండేళ్ల తర్వాత అవి రెండూ ఎలాగూ ఉంటాయి నాకు!"

"నాకు నమ్మకం లేదు. ఆ నమ్మకం కలగాలంటే నువ్వు నాకు మాటివ్వాలి."

"ఏమని?"

"ఈ రెండేళ్లలో పెండింగ్ లేకుండా అన్ని పేపర్లు పాసవుతానని, ఆ జులాయి రాయుళ్ళతో స్నేహం మాని సభ్యతగా ప్రవర్తిస్తానని! ఆ విధంగా నాకు మాటిచ్చావంటే నేను నిన్ను ఓ స్నేహితుడిగా అభిమానిస్తాను. రెండేళ్ల తర్వాత నేను కోరుకున్న క్వాలిఫికేషన్స్ నీకుంటే నిన్ను ప్రేమిస్తాను... పెళ్ళి చేసుకుంటాను."

ఒక్కక్షణం యిబ్బందిగా ముఖంపెట్టి "ఓ.కె. అలాగే మాటిస్తాను. నీవు మాత్రం మాట తప్పావో..?" అన్నాడు బెదిరింపుగా చూస్తూ.

"నేను మాట తప్పను... నువ్వు పరీక్ష తప్పకు. చదువు మీద దృష్టి పెట్టు!"

●

మౌనికకు మాట యిచ్చినట్టే అజయ్ తన స్నేహితులకు దూరంగా ఉండసాగాడు.

నాయకుడు లేకపోవడంతో అతని స్నేహితులు వెకిలిచేష్టలు మాని కుదురుగా ఉండసాగారు. మౌనిక అజయ్‌తో స్నేహంగా ఉండసాగింది.

ఇంతలో... సప్లిమెంటరీ పరీక్షలు వచ్చాయి!

అజయ్ ఎంత చదివినా పాఠాలు అతని బుఱ్ఱకెక్కడం లేదు. 'మాట యిచ్చినంత సులువు కాదు... పరీక్షలు పాసు కావడం!' అనిపించింది అతనికి.

అప్పుడు అతన్ని ఆదుకుంది మౌనిక. తను తయారుచేసుకున్న నోట్స్ అతనికిచ్చింది. అతనికి అర్థంకాని విషయాల్ని వివరించి చెప్పింది. గంట గంటకూ ఫోన్ చేసి ప్రోగ్రెస్ విచారించింది. ఓ అందమైన ఆడది తనపట్ల శ్రద్ధ చూపితే మగవాడు పొంగిపోతాడు. మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతాడు. అజయ్ విషయంలోనూ అదే జరిగింది. ఒక్క పేపరు తప్ప మిగిలిన అన్ని పేపర్లు పాసయ్యాడు.

"కంగ్రాట్స్ అజయ్!" అంది మౌనిక.

"సప్లిమెంటరీలో పాసవడం కూడా గొప్పేనా? పైగా, మళ్లీ ఓ పేపరు పెండింగు! అసలే సిగ్గుతో ఛస్తూంటే కంగ్రాట్స్ చెబుతావా?" అన్నాడు విసుగ్గా.

ఆనందంగా నవ్వింది మౌనిక. 'అజయ్ పరీక్ష ఫెయిలయినందుకు సిగ్గుపడుతున్నాడంటే... అతనిలో పరివర్తన వచ్చిందన్న మాటే!' అనుకుంది.

ఓరోజు అజయ్‌తో "మీ అమ్మానాన్నల్ని నాకు పరిచయం చెయ్యాలి నువ్వు!" అంది.

"ఎందుకు?" అనుమానంగా చూశాడు ఆమె వైపు.

"కాబోయే అత్తామామల్ని చూడాలనుకోవడం తప్పా?"

"అందుకు యింకా టైముందిగా?!"

"నాకు చూడాలని ఆశగా ఉంది. నీ స్నేహితురాలిగా పరిచయం చెయ్యి!"

"అలాగే! ఈ ఆదివారం ఉదయం మా ఇంటికి రా... పరిచయం చేస్తాను."

ఆదివారం మౌనికను తన తల్లిదండ్రులకు పరిచయం చేశాడు అజయ్. సుజాత మౌనికను కళ్ళతోనే పలుకరించింది. రామారావు ఆమెతో అభిమానంగా మాట్లాడాడు.

అజయ్‌ని బజారుకెళ్లి పూలు, పండ్లు తెమ్మని పంపింది సుజాత.

రామారావు "మావాడు ఎలా చదువుతున్నాడమ్మా?" అని అడిగాడు.

"అజయ్‌కేం సార్... బాగా చదువుతున్నాడు."

తృప్తిగా తలాడించి లోపలికెళ్లాడాయన. ఆయన్ని చూస్తే ఎంతో జాలేసింది మౌనికకు. 'చాలా అమాయకుడిలా ఉన్నాడీయన. అందుకే అజయ్ ఆటలిన్నాళ్లూ సాగాయి!' అనుకుంది.

"ఏమ్మా? ఎలా ఉన్నావు?" మౌనిక భుజాన్ని తట్టి ఆప్యాయంగా అడిగింది సుజాత.

"బాగున్నాను ఆంటీ... నా ప్రయత్నం పాతిక శాతం సక్సెస్ అయింది!"

"నీ ప్రయత్నం పూర్తిగా సక్సెస్ కావాలని, నీవు హాయిగా, నిశ్చింతగా ఉండాలని ఆ భగవంతుణ్ణి రోజూ కోరుకుంటున్నానమ్మా! నా ప్రయత్నంలో భాగంగా వాడికి మానసికంగా దగ్గరయ్యాను. వాడి ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. బాగా చదువుతున్నాడు కూడా!"

"అవును. దాదాపు అన్ని పేపర్లు పాసయ్యాడు ఈసారి!"

"ఆ క్రెడిట్ నీదే! యు ఆర్ గ్రేట్!" అంది సుజాత- మౌనికను మెచ్చుకోలుగా చూస్తూ.

"గాడ్ ఈజ్ గ్రేట్!" అంది మౌనిక నవ్వేస్తూ.

●

"అజయ్... నీకో గుడ్‌న్యూస్!" అంది మౌనిక.

ఏమిటన్నట్టు చూశాడు అజయ్.

"మన కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరపడానికి కొన్ని కంపెనీలు వస్తున్నాయి. ఇన్నాళ్లూ ఇంజనీరింగ్ చదివినవాళ్ళకే ఆ అవకాశాలని అనుకున్నాం కదా! ఈనాడు మనలో ప్రతిభ ఉన్నవారిని తీసుకోవడానికి ఆ కంపెనీలు వస్తున్నాయి. వాటికోసం చదవమని మా కజిన్ కొన్ని పుస్తకాలు నాకు పంపాడు. నువ్వూ మా ఇంటికి వస్తే యిద్దరం కలిసి చదువుకుందాం."

"మీ అమ్మానాన్నలు ఏమనుకోరా?"

"ఏమనుకుంటారు? మంచి పిల్లలు... చదువుకుంటున్నారు అనుకుంటారు!" అంది నవ్వుతూ.

ఆ క్షణం అజయ్ ముఖంలో గిల్టీఫీలింగ్ కనిపించింది ఆమెకు.

ఇద్దరూ మౌనిక ఇంట్లో ఇంటర్వ్యూకి ప్రిపేర్ కాసాగారు. ఆప్టిట్యూడ్ ప్రశ్నలకు అజయ్ సమాధానాలు చెప్పే వేగం చూసి ఆశ్చర్యపోయింది మౌనిక. అతను స్వతహాగా తెలివితేటలు ఉన్నవాడనీ, నిర్లక్ష్యం వల్లే చదువులో వెనకబడ్డాడనీ అర్థమైంది ఆమెకి.

క్యాంపస్ ఇంటర్వ్యూలో అజయ్ ఉద్యోగం తెచ్చుకున్నాడు. మౌనికకు ఉద్యోగం రాలేదు. అందుకు అజయ్ ఎంతో బాధపడ్డాడు.

"అరెఁ... నువ్వెందుకు అంత బాధపడతావు? ఈ ఉద్యోగం కాకపోతే యింకో ఉద్యోగం వస్తుంది నాకు. నువ్వు సెలబ్రేట్ చెయ్యాల్సిన సమయం యిది!" అంది మౌనిక.

"నా బాధ నీకర్థం కాదు..." అంటూ కోపంగా వెళ్లిపోయాడు అజయ్.

●

రామారావు, సుజాత మౌనిక ఇంటికి వచ్చారు.

"వాడు ఓ విషయం గురించి బాధపడటం చాలారోజుల తర్వాత చూస్తున్నాను. అదీ... మరో వ్యక్తి గురించి బాధపడటం మొదటిసారి చూస్తున్నాను. నువ్వు వాణ్ణి మార్చేశావమ్మా... పూర్తిగా మార్చేశావు!" మౌనిక రెండు చేతులు పట్టుకుని అంది సుజాత కళ్ళనీళ్లతో.

"ఊరుకోండి ఆంటీ! మన అదృష్టం బాగుండి అజయ్ మారాడు. మనం కోరుకుంది కూడా అదే కదా!"

"నీకు అంత పెద్ద సమస్య సృష్టించిన వాడి పట్ల అంత సహనం ఎలా చూపగలిగావు తల్లీ?" అని అడిగాడు రామారావు.

"ఆరోజు యీ సమస్య ఎదురైనప్పుడు ఎంతో ఆలోచించాను. స్నేహితురాళ్ళు పోలీసు కంప్లైంటు యివ్వమని, ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చెయ్యమని సలహా యిచ్చారు. అలా చేస్తే అతను మరింత రెచ్చిపోతాడు. అవమానంతో తను అన్నది, అనుకున్నదీ చేసితీరుతాడు. అప్పుడు నా జీవితం నాశనమవుతుంది లేదా అంతమవుతుంది. తర్వాత నేరం నిర్ధారణ

అయితే అజయ్‌కి శిక్ష పడుతుంది. అతని జీవితం పాడవుతుంది. మా ఇద్దరి తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుంది. ఇవన్నీ జరగకుండా ఉండాలంటే నేను అతనితో స్నేహం చెయ్యాలి. దానవుణ్ణి క్రమంగా మానవుడిగా మార్చాలి. నేను అదే చేశాను. ఇందుకు నాకు ఎంతో సహనం, ధైర్యం కావలసివచ్చింది. మొదటిది– భగవంతుడిస్తే... రెండవది– మా నాన్నగారు నాకిచ్చారు."

సుజాత ఆశ్చర్యంగా సూర్యం వైపు చూసింది.

"ఓ అబ్బాయి 'ఐ లవ్ యూ' అని చెప్పగానే అమ్మాయి చెప్పుతీసి కొట్టడం, చెంప పగలగొట్టడం చేసే రోజులు కావు యివి. అమ్మాయిలు అబ్బాయిలతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పుడు ఆ ఒక్క విషయంలో ఎందుకు భయపడాలి? క్యాంపస్ ఇంటర్వ్యూల గురించి, ఇంటర్నెట్‌లో వెబ్‌సైట్ల గురించి మాట్లాడుకున్నట్లే ఆ విషయం గురించి కూడా ఓ చోట కూర్చుని మాట్లాడుకోవాలి. అతనితో జీవితం పంచుకోవడం యిష్టం లేకపోతే వీలైనంత మృదువుగా అతనితో ఆ విషయం చెప్పి ఒప్పించాలి. అతను అప్పుడూ వినకుండా విపరీత ధోరణులకు పోతే ఏం చేయాలో తల్లిదండ్రులతో మాట్లాడి నిర్ణయించుకోవాలి. మౌనిక ఆ పనే చేసింది. అన్ని విషయాలూ నాతో చెప్పింది. నిజానికి సమాజంలో యీనాడున్న బర్నింగ్ ప్రాబ్లమ్స్‌లో యిది కూడా ఒకటి. తన ముఖం బర్న్ కాకుండా ధైర్యంగా అతన్ని డీల్ చెయ్యమని నేనే సలహా యిచ్చాను" అన్నాడు సూర్యం.

"అజయ్‌లో మార్పుకోసం ప్రయత్నించాలని నిర్ణయం తీసుకోగానే ముందుగా అతని కుటుంబ సభ్యుల్ని చూడాలనిపించింది నాకు. అందుకే ఆరోజు మీ ఇంటికి వచ్చి మీతో మాట్లాడాను. మీరు అజయ్‌లా అహంకారం, మొండితనం కలవారు కారు. మంచితనం, అమాయకత్వం మూర్తీభవించిన వారు. మిమ్మల్ని చూశాక నా ప్రయత్నం సఫలం అవుతుందన్న నమ్మకం నాకు కలిగింది.

నా సమస్యను ఎదుర్కోవడానికి నేను ఎన్నుకున్న పద్ధతి కొంతమందికి నచ్చకపోవచ్చు. అయితే ఏ సంఘమైనా, సంస్థ అయినా రంగంలోకి వచ్చేది నాకు జరగాల్సిన నష్టం జరిగాకే! అప్పుడు ఎన్ని ఆందోళనలు జరిపినా, దోషికి శిక్ష పడినా చూడటానికి నేనుండను. ఇది నా జీవితం... అందంగా మలుచుకున్నా, అర్థాంతరంగా ముగించుకున్నా అది నా చేతుల్లోనే ఉంది. అందుకే అందం కోల్పోకుండా, జీవితం అర్థాంతరంగా ముగింపబడకుండా జాగ్రత్తపడ్డాను. పైగా, ఓ మనిషిని సంస్కరించానన్న తృప్తి నాకు దక్కింది!" అంది మౌనిక.

"మరి, అజయ్ పెళ్ళి ప్రస్తావన తెస్తే ఏం జవాబిస్తావు?" ఆసక్తిగా అడిగింది సుజాత.

"ముందు అతన్ని అడగనీండి... జవాబు అతనికే చెబుతాను!" అంది మౌనిక నవ్వుతూ.

●

అజయ్ గదిలోకి వచ్చిన మౌనిక అతను దుస్తులు సూట్‌కేస్‌లో సర్దుతూండటం చూసి– "అదేమిటీ... నీ ప్రయాణం రేపు కదా?" అని అడిగింది.

"రేపు ఉదయం తిరుమలకు వెళ్లి దేవుని దర్శనం చేసుకుని, సాయంత్రం అట్నుంచి హైదరాబాదు వెళతాను..." అన్నాడు అజయ్.

"మంచి ఆలోచన! 'దేవుడా... మంచి ఉద్యోగం యిచ్చావు. పెళ్ళి కూడా త్వరగా జరిపించెయ్ తండ్రీ!' అని కోరుకో!"

"నా పెళ్ళికేం తొందరలేదు. మరో నాలుగేళ్ళు నా కెరీర్ పైనే దృష్టి పెడతాను. నీ పెళ్ళి మాత్రం త్వరగా జరిపించమని ఆయన్ని కోరుకుంటాను" అన్నాడు నవ్వుతూ.

"నా పెళ్ళి, నీ పెళ్ళి ఏమిటీ... 'మన పెళ్ళి' అనకుండా?!"

"అలా అనే అర్హత నాకు లేదు. ఆరోజు నా ప్రవర్తన, నేను వాడిన పదజాలం తలచుకుంటే నాకే అసహ్యం వేస్తోంది. నన్ను క్షమించమని నిన్ను అడగటానికి నేను సిగ్గుపడటం లేదు. దయచేసి ఆరోజు నేనన్నవన్నీ మర్చిపో! నీకు నచ్చిన వ్యక్తిని పెళ్ళాడి సుఖంగా ఉండు. నాకు కార్డు పంపితే పెళ్ళికి నేను తప్పకుండా వస్తాను."

"నన్ను మాట తప్పొద్దన్నావు?"

"నేను దారి తప్పినప్పుడు అలా అన్నాను. నాకు దారి చూపి, నాచే చదివించి నాకో ఉద్యోగాన్ని కూడా ప్రసాదించిన దేవతవి నువ్వు! దేవతలకు, రాక్షసులకు వియ్యం కుదరదు."

"అలా మాట్లాడకు అజయ్! నువ్వు రాక్షసుడివి కావు. సభ్యత, సంస్కారం మూర్తీభవించిన వ్యక్తివి. నిజానికి నీలో మార్పు తీసుకురావడం కోసమే నీ ప్రేమను అంగీకరించినట్లు నటించాను. నీలో నేను కోరుకున్న పరివర్తన రాగానే నాకు నిన్ను పెళ్ళి చేసుకోవడం యిష్టంలేదని చెప్పాలనుకున్నాను. ఎందుకంటే... అప్పటికి మనుషుల్ని అర్థంచేసుకునే సంస్కారం నీకు అలవడి ఉంటుంది కాబట్టి! కాని, నిన్ను దగ్గరగా పరిశీలించాక నీలోని మంచితనం నాకు కనిపించింది. పెళ్ళి జీవితంలో తప్పనిసరి అయినప్పుడు ఎవరో ముక్కూ, మొఖం తెలియనివాడిని చేసుకునేకంటే నాకు బాగా తెలిసిన వ్యక్తిని, నాకు నచ్చిన వ్యక్తిని, నన్ను మెచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే నా జీవితం సాఫీగా సాగుతుందని నా నమ్మకం."

"కానీ, మౌనికా..."

"మర్యాదగా చెప్తున్నాను. నువ్వు నన్ను ప్రేమించాలి. లేకుంటే నీ ముఖంపై ఆసిడ్ పోస్తా... చంపేస్తా!" అంది మౌనిక- అతని వైపు క్రూరంగా చూస్తున్నట్లు నటిస్తూ.

ఆమెను అలా చూసిన అజయ్ బిగ్గరగా నవ్వసాగాడు.

●

**'ఆంధ్రభూమి' దినపత్రిక నిర్వహించిన 'ఉగాది కథల పోటీ- 2008'లో ఎంపికై**
**'ఆంధ్రభూమి' దినపత్రిక ... 5 జూలై' 2008 సంచికలో ప్రచురితమైన కథ**